క్లుప్తంగా

ఐఓటీ సిస్టమ్స్ డిజైన్స్‌పై వర్క్ షాప్



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డిజైన్ వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి తెలిపారు. విద్యార్థులను సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నిపుణులుగా తీర్చిదిద్దేందుకు గుర్గావ్‌కు చెందిన ప్రముఖ సంస్థ ప్రగ్యాత్మిక సాల్యూషన్స్ ట్రైనింగ్ హెడ్ అమిత్ పర్యవేక్షణలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రగ్యాత్మిక ట్రైనింగ్ హెడ్ అమిత్ మాట్లాడుతూ మూడు రోజుల వర్క్ షాప్ లో విద్యార్థులు సమాజంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల డిజైన్లను తయారు చేస్తారని అన్నారు. వర్క్ షాప్ కో ఆర్డినేటర్ సూదా కృష్ణార్జునరావు మాట్లాడుతూ వర్క్‌షాప్ అనంతరం 24 గంటల హ్యాకథాన్ నిర్వహిస్తున్నామని, తద్వారా విద్యార్థులకు ప్రొటోటైప్ డిజైన్స్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.మధుసూదన రావు, విభాగాధితులు వి.రమాదేవి, పీఐ స్నేహాలత పాల్గొన్నారు.

కిష్కింధకాండపై ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై దివంగత ముప్ప వరపు కేశవరావు శత జయంతి సందర్భంగా శ్రీవాల్మీకి మహర్షి ప్రణీత శ్రీమద్రామాయణ ప్రవచన నవాహ జ్ఞానయజ్ఞంలో భాగంగా కిష్కింధకాండలోని అనేక అంశాలను చంద్రశేఖరశర్మ వివరించారు. ప్రముఖ ఆడిటర్ గబ్బిట శివరామకృష్ణ మూర్తి, పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మస్తానయ్య, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో ముప్పవరపు వేంకటసింహాచలశాస్త్రి పాల్గొన్నారు.

దక్షిణ భారత సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక బహుమతి



గుంటూరు ఎడ్యుకేషన్: పుదుచ్చేరిలో ఈనెల 21 నుంచి 25 వరకు జరిగిన దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గుంటూరు బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రూపొందించిన గగన్‌యాన్ ప్రాజెక్టు ప్రత్యేక బహుమతి అందుకుంది. పుదుచ్చేరి నుంచి తిరిగి వచ్చిన విద్యార్థినులు ఎండీ అనీసాబేగం, ఎస్.ఈర్పిత, గైడ్ టీచర్ ఎండీ ఆరిఫ్ బేగ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఉషాకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థినులు ఎంతో ఆసక్తిగా రూపొందించిన గగన్‌యాన్ నమూనా ప్రాజెక్టు జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికై, అక్కడి నుంచి దక్షిణ భారతస్థాయికి ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణ ఆవరణలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేద పండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీ గణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


త్రిపురనేని మహాగ్రంథం 'సూతపురాణము'

- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆరంభమైన శతవసంతాల సంబరాలు
- 29న గుంటూరులో వేడుకలు, త్రిపురనేని జాతీయ పురస్కారాల ప్రదానం





తెనాలిలోని త్రిపురనేని కార్యక్షేత్రం 'సూతాశ్రమం' (ఇన్‌సెట్) త్రిపురనేని రామస్వామి



సూతపురాణము కావ్యం

తెనాలి: 'హేతువాద యుగంలో కవులందరికీ ఆదిపురుషుడు త్రిపురనేని రామ స్వామి. ఆయన సూతపురాణమొక మహాగ్రంథం. ఆయన పద్య రచనాశైలి ఎంతో మనోహరంగా ఉంటుంది. భావాలు పురాణాలకు వ్యతిరేకం. మొదట విప్లవం తెచ్చింది ఆయన' అన్న ప్రఖ్యాత కవి విశ్వనాథ సత్యనారాయణ మాటలు, భావవిప్లవ వైతాళికుడు త్రిపురనేని రామస్వామి ఎంతటి ప్రజ్ఞావంతులో వెల్లడిస్తాయి.

కవిరాజు త్రిపురనేని రామస్వామి 1925లో 'సూతపురాణము' రాశారు. ఆ మహాగ్రంథానికి ఇప్పుడు శతవసంతాలు. సాహిత్య చరిత్రలో ఒక సంచలనమైన ఈ కావ్యానికి శతవసంతాల సంబరాలు రామస్వామి జన్మదినమైన ఈనెల 15న ప్రారంభమై, ఆయన వర్ధంతి రోజైన జనవరి 16, 2026న రెండు తెలుగు రాష్ట్రాల్లో ముగుస్తాయి. ఇందులో భాగంగా బుధవారం గుంటూరులో 'సూతపురాణము శతవసంతాల వేడుక, కవిరాజు త్రిపురనేని జాతీయ పురస్కార సభ'ను నిర్వహించనున్నారు. కవిరాజు త్రిపురనేని సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం గుంటూరులోని జేకేసీ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటయే సభకు సమితి గౌరవ అధ్యక్షుడు గద్దె మంగయ్య అధ్యక్షత వహిస్తారు. ఇదే సభలో సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ దేవరాజు మహారాజు, తెనాలికి చెందిన రచయిత, ప్రజాసాహితీ ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబును త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కారంతో సత్కరిస్తారు.

కృష్ణాజిల్లాలోని అంగలూరులో జన్మించిన రామస్వామి ముంబయిలో ప్లీడర్‌షిప్, ఐర్లండ్ రాజధాని డబ్లిన్లో బారిష్టరు చదువుకుని బందరులో ప్రాక్టీస్ ఆరంభించారు. తర్వాత విజయవాడకు, మరికొంతకాలానికి తన కార్యక్షేత్రాన్ని తెనాలికి మార్చుకున్నారు. తన ఆశయ సాధనకు తెనాలిలోని ఇంటిని సూతాశ్రమంగా మార్చారు. అది హేతువాద సమరానికి కార్యక్షేత్రమైంది. తన రచనా వ్యాసంగానికి, వికాసోద్యమానికి ఒక ఆచార్యపీఠంగా వాసికెక్కింది. అక్కడే 'సూతపురాణము' వెలువడింది.

సామాజిక రుగ్మతలను, మతమౌఢ్యాన్ని, ఛాందసవాదాన్ని, దురాచారాలను ప్రజాహితం కోసం ఎదిరించడానికే రామస్వామి తన రచనలనే ఆయుధంగా ఎంచుకున్నారు. ఆయన ప్రారంభించిన సామాజిక విప్లవం అంతటితో ముగిసినట్టు కాదు. సామాజిక సమన్యాయం నెలకొనటానికి మరెన్నో పోరాటాలు అవసరమని మన అనుభవం చెబుతోంది. అందుకు తగిన స్ఫూర్తినిచ్చేందుకు భావితరాలకు కవిరాజు సాహిత్యం అందించాలంటే సూతపురాణము కావ్యం శతవార్షికోత్సవమే కాదు...కవిరాజు ఇతర రచనలనూ నేటితరానికి అందించాలి. 'శాస్త్రములెల్లజదివి విజ్ఞానమెరిగి/సంశయింపక సర్వథా చర్చజేసి/ నిజమెరుంగ వలయు నిది నేర్వకున్న/ మూఢవిశ్వాసమున జేటు మూడుచుండు' అన్నారు రామస్వామి. 'హేతువాద బుద్ధిని ఉపయోగించి పాతపురాణాల్ని నమ్మవద్దనీ, ప్రశ్నించి, మీ బుద్ధికి నిజమని తోస్తేనే నమ్మండి' అన్న రామస్వామి మాటలనే కాదు...నేటి సామాజిక, రాజకీయ పరిణామాలను అర్థంచేసుకుంటూ ప్రశ్నించటం నేర్పగలగాలి. అప్పుడే సూతపురాణము శతవసంతాల సంబరాలకు సార్థకత.

కార్పెంటర్స్ సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: మానవ నాగరిక సమాజానికి అవసరమైన అన్ని రకాల వస్తువులను తయారుచేసి అందిస్తున్న కార్పెంటర్స్ సేవలు అభినందనీయమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం వసంతరాయపురంరోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ది స్టేట్ కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యంత్రాల ద్వారా తయారవుతున్న ఇంటి, కార్యాలయాల వస్తువులతో లక్షలాది మంది కార్పెంటర్స్ అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ కోశాధికారి తామరపల్లి మోహన్ రావు, జిల్లా కన్వీనర్ జి.సూర్యనారాయణ, సంఘ నాయకులు వై.మల్లేశ్వరరావు, విశ్వనాథ్ శర్మ, వీరభద్రాచారి, కాళంగి బాబు, కె.ప్రసాద్, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

మూడు వంతెనల పనులు పూర్తి చేయాల్సిందే..!

- 10వ తేదీ వరకు గడువు
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని డొంక రోడ్ మూడు వంతెనల వద్ద రైల్వే శాఖ చేపట్టిన నూతన ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులు ఫిబ్రవరి 10వ తేదీ నాటికి పూర్తి చేయాల్సిందేనని, ఇప్పటికే ట్రాఫిక్ రద్దీతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, రైల్వే అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ మూడు వంతెనల దగ్గర జరుగుతున్న పనులను రైల్వే, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గతేడాది నవంబర్ 25 నుంచి డొంక రోడ్ వద్ద మూడు వంతెనల మార్గంలో రైల్వే శాఖ ట్రాక్ ఎక్స్ టెన్షన్ కోసం రాకపోకలు నిలుపుదల చేశామన్నారు. ఫలితంగా అరండల్ పేట, శ్రీనగర్, గుంటూరు వారితోట, డొంక రోడ్ తదితర ప్రాంతాల ప్రజలు కొత్తపేట, బస్టాండ్, ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. త్వరలో శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు ప్రారంభం కానున్నందున పనులను ఫిబ్రవరి 10 నాటికి పనులు పూర్తి చేసేలా రైల్వే ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల వేగవంతానికి రాత్రిపూట కూడా జరగడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సదరు ప్రాంతంలో జీఎంసీ తాగునీటి పైప్ లైన్ షిఫ్ట్, డ్రెయిన్ పనులను చేపట్టినట్లు వివరించారు. రైల్వే శాఖ చేపడుతున్న పనులకు జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని, పనులు పూర్తయ్యే వరకు ప్రత్యేకంగా ఒక అధికారిని కేటాయించాలని ఎస్ఈని ఆదేశించారు. పర్యటనలో రైల్వే డెప్యూటీ చీఫ్ ఇంజినీర్ నోయల్, జీఎంసీ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కళ్యాణరావు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్ ఫిర్యాదులను 24 గంటల్లో, పీజీఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 25 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. సోమవారం ప్రజల నుంచి 48 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 13, ఇంజినీరింగ్ విభాగానికి 16, రెవెన్యూ విభాగానికి 9, ప్రజారోగ్య విభాగానికి 7, అకౌంట్స్ విభాగానికి 1, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పీఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

యానిమేటర్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.పద్మ

లక్ష్మీపురం: యానిమేటర్ల ఆరు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి రద్దు చేయాలని కోరుతూ యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు రాకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. మండలాల్లో వీఓఏలను అక్రమంగా తొలగించడం తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్న మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరారు.

రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. మండలాల్లో అధికారులు యానిమేటర్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు యానిమేటర్స్ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ నాయకులు ఇప్పుడు కనీసం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా యానిమేటర్లకు ఆరు నెలల వేతన పెండింగ్ ఉందంటే యానిమేటర్లపై ఈ ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఏమిటో అర్థం అవుతుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా యానిమేటర్లకు వేతనాలు పెంచాలని కోరారు. నిరసన దీక్షకు సంఘం జిల్లా అధ్యక్షురాలు కే పద్మ అధ్యక్షత వహించారు. యానిమెటర్ల నిరసన దీక్షలకు సంఘీభావంగా గుంటూరు జిల్లా ప్రైవేట్ ట్రాన్స్‌ఫోర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, సీఐటీయూ గుంటూరు తూర్పు కమిటీ కార్యదర్శి కే శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేబోరా, విజయలక్ష్మి, షాజ, మేరీ, జ్యోతి, కనకదుర్గ పాల్గొన్నారు.

కార్మికులకు పనిభద్రత కల్పించాలి



మాట్లాడుతున్న నేతాజి

లక్ష్మీపురం: ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా విస్తృత స్థాయి సమావేశం పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఎం.రమేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వై.నేతాజీ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా పంచాయతీ వర్కర్స్‌కి పని భద్రత లేకుండా పోతుందని చెప్పారు. ఇప్పటికే చేబ్రోలు గ్రామపంచాయతీలో 12 మంది కార్మికుల్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ కారణాలతో అక్రమంగా తొలగించారని విమర్శించారు. మార్చి 31 నాటికి పూర్తి కావాల్సిన టెండర్ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదని, దీంతో టెండర్ కార్మికులు వేతనాలు పెంచుకునే అవకాశం కోల్పోతున్నారన్నారు. పలు పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు ఇప్పటికీ రూ.6 వేలు జీతం మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు, యూనిఫాం సంవత్సరాలు తరబడి పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్మికులు అంతా ఐక్యమై పోరాటం చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు రమేష్, సంగమేశ్వర రావు, లక్ష్మీ, ఓ నాగరత్నం, శివశంకర్, సంధ్య పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు 17 నామినేషన్ల అర్హత



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ స్థాయి సంఘం(స్టాండింగ్ కమిటీ) ఎన్నికకు దాఖలైన 17 నామినేషన్లు(చెల్లుబాటు) అర్హత పొందినట్లు ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు సోమవారం తెలిపారు. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, ఫిబ్రవరి 3న ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా, సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను స్క్రూటినీ చేశామని తెలిపారు. స్క్రూటినీ అనంతరం 17 నామినేషన్లు పోటీకి అర్హత పొందినట్లు వివరించారు. ఈ నెల 27వ నుంచి 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, అదే రోజు తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పట్టాభిపురం స్టేషన్ తనిఖీ

లక్ష్మీపురం: పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌ను వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ సోమవారం తనిఖీ చేశారు. రౌడీషీటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. డీఎస్పీతో పాటు స్టేషన్ సీఐ వీరేంద్రబాబు ఉన్నారు.

మాజేటి గురవయ్య హైస్కూల్ 80వ వార్షికోత్సవం



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న పాఠశాల ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య హైస్కూల్ 80వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల పూర్వ విద్యార్థి ధూర్జటి సూర్య ప్రకాశరావు, డాక్టర్ కొంపల్లి ప్రతాప్, డాక్టర్ పల్లుట్ల మల్లికామహాలక్ష్మి పాల్గొన్నారు.

డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మాజేటి వెంకట రామకోటి ముత్యాలుతో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మాజేటి వీఎస్సార ప్రసాద్, హిందూ కళాశాల హై స్కూల్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు, ప్రధానోపాధ్యాయురాలు ఎం.శారదాదేవి పాల్గొన్నారు.

ముగిసిన త్యాగబ్రహ్మ ఆరాధన సంగీత మహోత్సవాలు



త్యాగరాజ కీర్తనల అలాపన

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి నిర్వహిస్తోన్న సంగీత సద్గురు త్యాగబ్రహ్మ ఆరాధనా మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సన్మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎంవై.శేషురాణి ఆధ్వర్యంలో జరగ్గా, లఘు కచేరీల్లో స్థానిక కళాకారులు త్యాగరాజ కీర్తనలను ఆలపించారు. సాయంత్రం గండూరి శ్రీనివాసమూర్తి (విజయవాడ) శిష్య బృందం ఉత్సవ సంప్రదాయ కీర్తనలను ఆలపించగా, పలువురిని అలరించాయి. అనంతరం గండూరి శ్రీనివాసమూర్తిని సత్కరించారు. కె.గాయత్రి (చెన్నై) శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా జరగ్గా, అనేక త్యాగరాజ కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని(విజయవాడ), మృదంగంపై బుర్రా శ్రీరామ్(చెన్నై), ఘటంపై ఎం.హరిబాబు(గుంటూరు) వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏవీ.మంగాదేవి పాల్గొనా, కళాకారులను అతిథులను సత్కరించారు.

ఫిబ్రవరి 9న మహా నిరసన ర్యాలీ

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

నెహ్రూనగర్: త్వరలో చేపట్టబోయే జనగణనతో పాటే ఓబీసీ కులగణన కూడా చేపట్టాలని డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న గుంటూరు నగరంలో మహా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓబీసీ అని చెప్పుకునే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీలకు చేసిందేమి లేదన్నారు. బీపీ మండల్ చేసిన సిఫార్సులు అమలు చేయాలని ప్రధానిని కలిసినప్పటికి ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బీసీ ప్రతినిధులంతా కూడా మమ్మల్ని గెలిపిస్తే బీసీల గొంతుకగా మాట్లాడతామని చెప్పుకున్న వారు గెలిచిన తరువాత వారి పార్టీ అజెండాతో ముందుకు సాగుతున్నారని మండిపడ్డారు. బీసీలు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే తప్ప బీసీలకు న్యాయం చేయడంలో ప్రజాప్రతినిధులు విఫలం చెందారని విమర్శించారు. కులగణన చేపట్టకపోతే రాజకీయ ప్రజాప్రతినిధులకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని బీసీ మండల్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ అక్కడ నుంచి మార్కెట్ సెంటర్‌లోని పూలే విగ్రహం వరకు పాదయాత్ర చేసి తమ నిరసన తెలియజేస్తామన్నారు. అనంతరం నిరసన ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, మల్లే ఈశ్వరరావు, బ్రహ్మానంద శర్మ, కోలా అశోక్, కొల్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి జాతాను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నేతాజి, రామారావు

లక్ష్మీపురం: సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈనెల 30న రాజధాని నిర్మాణం- రాష్ట్రాభివృద్ధి పేరుతో జాతా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజి తెలిపారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నిర్వహించనున్న 27వ రాష్ట్ర మహాసభ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేతాజి మాట్లాడుతూ గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి నెల్లూరు వరకు జనవరి 30, 31 తేదీలలో నిర్వహించనున్న జాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు జాతాకు నాయకత్వం వహిస్తారని వెల్లడించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు, ఎస్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, కె.నళినీకాంత్‌లు పాల్గొంటారని తెలిపారు. జాతా జనవరి 30 తాడేపల్లిలో ప్రారంభమై మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని మీదగా గుంటూరు చేరుకుంటుందన్నారు. జనవరి 31న గుంటూరు నుంచి బయలుదేరి నారాకోడూరు, తెనాలి, పొన్నూరు, బాపట్ల, చీరాల, ఒంగోలు మీదగా నెల్లూరు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాశం రామారావు, ఎం.రవి, ఎస్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, కె.నళీని కాంత్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దళిత ద్రోహి రఘురామకృష్ణంరాజు

- ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై వ్యాఖ్యలు సిగ్గుచేటు
- దళిత సంఘాల వెల్లడి



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

నెహ్రూనగర్: దళిత ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను టార్గెట్ చేస్తూ శాసన సభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యలు చూస్తుంటే దళితులంటే ఎంత చిన్న చూపే స్పష్టంగా అర్థమవుతోందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(భీమ్ రాం అంబేడ్కర్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు పేర్కొన్నారు. లాడ్జిసెంటర్‌లో దళిత సంఘాల నాయకులు సోమవారం విలేకరులతో మాట్లాడారు. అనేక కేసులో నిందితుడిగా ఉన్నట్లు ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు తన ఎన్నికల అఫిడవిట్‌లో దాఖలు చేశారని.. ఇంకా కోర్టుల్లో వివిధ కేసులు పెండింగ్‌లో ఉన్న ఆయన అరెస్టు కాకుండా బయట తిరుగుతుంటే ఒక్క కేసు ఉన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పీవీ సునీల్‌కుమార్‌ను అరెస్టు చేయాలని ఆయన మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. కమ్మరాజ్యంలో వెయ్యి కోట్లు తిన్న ఆర్ఆర్ఆర్‌కు బెయిల్ వచ్చింది. కాని దళిత అధికారి విజయ్‌పాల్‌కు ఇంత వరకు బెయిల్ రాలేదంటే టీడీపీకి దళితులంటే ఎంత చిన్న చూపో అర్థమవుతోందన్నారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ పీవీ సునీల్‌కుమార్ ప్రతిష్ట దెబ్బతీసే విధంగా పత్రికల్లో కథనాలు రాయించడం బాధాకరమన్నారు. అఖిల భారత మాల సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు అన్నవరపు కిషోర్ మాట్లాడుతూ దళిత అధికారి సునీల్‌కుమార్ ఎవరూ లేరని ఏది పడితే అది మాట్లాడితే సహించేదన్నారు. ఆర్ఆర్ఆర్ అరెస్టు చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాల సంఘాల నాయకులు వాసు, శేషయ్య పాల్గొన్నారు.